# పందెంలో పైచేయి

"అన్నపూర్ణ"



ప్రద్యుమ్నరావుకు వాళ్ల ఆఫీసు వాళ్లు ఇచ్చిన బిరుదులు రెండు. ఒకటి సతీదాసుడు, రెండు కూపస్థ మండూకం.

ఏనాడూ ఆఫీసుకు ఓ అరగంట ముందు రాడు కొలీగ్స్‌తో బాతాఖానీ కొట్టటానికి. టయం అయిన తర్వాత ఎవరితోనూ కలవడు, బజారు పట్టుకు తిరగటానికి. ఆఫీసునుంచీ డైరెక్ట్‌గా ఇంటికే వెళ్తాడు.

షికారు చేసినా, సినిమాలు చూసినా తోడు భార్య వుండి-తీరుతుంది... నిజానికి లలిత అంటే అతనికి తగని 'ఇది'. కారణం విద్యార్థిదశలో తాను కన్న కలలకు ప్రతిరూపంగా భావిస్తాడు ఆమెను.

లలిత అందమైనదే కాకుండా చదువుకున్నది కూడా. పైగా ప్రద్యుమ్నరావు అంటే ఇష్టపడుతుంది.

రోజూ సాయంత్రం అయిదయ్యేసరికి వెళ్ళి వీధిగేటు దగ్గర నిలబడుతుంది లలిత, భర్త కోసం ఎదురుచూస్తూ. కొన్ని నిమిషాలు యుగాలుగా గడిచిన తర్వాత వీధి చివరన చేతులు వూపుతూ కనిపిస్తాడు. దాంతో ఆమె ముఖం వికసిస్తుంది.

ఇద్దరూ చేతిలో చెయ్యి వేసుకొని ఆనందంగా లోపలికి వస్తారు

"ఈపూట టిఫిన్ ఏం చేశావ్ లల్లీ?" అనడుగుతాడు ప్ర. రావు

చేసిన పదార్థం గురించి చెబుతుంది లలిత.

ఏది చేశానని చెప్పినా 'వెరీగుడ్' అని మెప్పుకోలు విసిరి "వేడి చల్లారిపోయి వుంటుంది... నువ్వు తినెయ్యకపోయావా?" అంటాడు.

"కాస్తలో ఏం ముంచుకుపోయింది లెండి. మీరు వచ్చారుగా?... అదేమిటోగాని మిమ్మల్ని వదిలిపెట్టి నాకు ఒక్కదానికే తినబుద్ధి కాదండీ" అంటుంది.

లలితకు తనంటే వింత ప్రేమ!— అటువంటప్పుడు వింతగానో పొంగిపోతాడు ప్ర. రావు.

"నాకూ అంతే లల్లీ... ఆఫీసు వదలగానే సరాసరి ఇంటికివచ్చి నిన్ను చూడందే వుండలేను..." అంటాడు.

ఇద్దరూ కలిసి సంతోషంగా టిఫిన్ ముగిస్తారు.

రోజూ వేళకే మామూలుగా తను ఎక్కే సిటీబస్‌లోనే ఎక్కాడు ప్రద్యుమ్నరావు ఇంటి దగ్గరేదో నక్కను తొక్కివచ్చినట్లు రోజూ బస్‌లో నిలబడి ప్రయాణం చేసే అతడికి ఆ రోజు ఆడవాళ్ళు కూర్చునే సీటుకు దగ్గరిగా చోటు దొరికింది.

మరో స్టేజీ వచ్చింది కొంతమంది దిగారు మరికొందరు ఎక్కారు.

ప్రద్యుమ్నరావుకు ఎదురు సీటులో ఓ యువతి వచ్చి కూర్చొంది

ఏదో ఆలోచిస్తున్న అతడు తలయెత్తి చూసేసరికి ఆమె ఈ మధ్య కొన్ని రోజులుగా ఆదే స్టేజీ దగ్గర, ఇదే బస్ ఎక్కటం గమనిస్తూనే వున్నాడు ... అయితే ఆ యువతిని మరీ దగ్గరిగా చూడటం మాత్రం ఇదే మొదటిసారి.

తనవైపు చూసిన ప్రద్యుమ్నరావుకు సమాధానంగా చిరునవ్వు విసిరింది ఆమె

ఆ యువతి అందమంతా ఆ నవ్వులోనే వున్నట్లు తోచింది అతడికి ఆ క్షణంలో... అయినా ఏ మాత్రం పరిచయం లేని తనవైపే చూసి ముసి ముసి నవ్వులు విసురుతుందేమిటి, బస్‌లో ఇంతమంది వుండగా? ...ఇదేదో ముదురు కేసు కాదు కద? ... ఏమైతేనేం, తను మగవాడు

... తన దృష్టినంతా ఆమె మీదికే కేంద్రీకరించాడు. అయినా అతడి చూపులకు ఏమాత్రం చిరాకు పడినట్లు కనిపించలేదు ఆ యువతి. 'మీరలా చూడటమే నాకు యిష్టం' అన్నటు వూరుకుండి పోయింది.

ప్రద్యుమ్నరావు ఆలోచనలు ఎటో పయనించబోతున్నయ్ .. అంతలోనే అతడి స్టేజీ వచ్చింది. దిగేశాడు తప్పదన్నట్టే... తర్వాత అక్కడే నిలబడ్డాడు బస్ కదిలిపోయేవరకు ... కదిలి పోతున్న బస్ లోంచి ఆ యువతి చేతులు వూపటం కనిపిస్తోంది.

ఆ ఒక్కరోజునే కాదు — అలా కొన్ని రోజులు జరిగాయి.

ఆఫీసులో పని చేస్తున్నా, ఇంటి దగ్గర లలితతో మాట్లాడుతున్నా ఆ యువతి రూపమే కనిపిస్తోంది.

రాను రాను అదివరకటిలా ఆఫీసయి పోగానే సరాసరి ఇంటికి రాబుద్ధి కావటం లేదు అతడికి. లలితతో ఎప్పటిలా మనసు విప్పి మాట్లాడలేక పోతున్నాడు... కారణం ఆ యువతి కలుపుగోలుగా మాట్లాడటం కూడా మొదలు పెట్టింది ప్ర. రావుతో.

* * *

ఆ రోజు ఆమె మీరు కరెక్ట్‌గా సాయంత్రం అయిదున్నరయ్యేసరికి మా యింటికి రావాలి నా మాటకు మీరిచ్చే విలువేమిటో తేలిసిపోతుంది ఈవేళ' అంది ఆ ప్రకారమే మాట యిచ్చాడు వసా వని. అందుకోసం మధ్యాహ్నం సెలవు పెడదామని చూశాడు. కానీ, వీలుపడక పోయింది...అయినా మాట నిలుపుకోవటం కోసం — ఆఫీసు పోగానే ఇంటికి వెళ్ళి కాస్త ముస్తాబు కూడా కాకుండా సరాసరి ఆ యువతి చెప్పిన అడ్రసు యింటిని వెతుక్కుంటూ శ్రమపడి వెళ్ళాడు.

వరండాలో కవ్వించే కళ్ళతో, ఆకర్షించే చిరునవ్వుతో ఎదురైంది వాసంతి.

"అన్న మాట ప్రకారమే వచ్చారే!... రండి .." అంటూ సాదరంగా లోపలికి ఆహ్వానించింది ప్రద్యుమ్నరావును.

చాలా అందంగా నీటుగా వుంది ముందు గది... ఓ కుర్చీ చూపించి కూర్చోమని ఎంతో హడావిడి పడుతూ లోపలికి వెళ్ళి ప్లేటుతో టిఫిన్ తెచ్చింది.

చెయ్యి ప్లేటులో ఫలహారం మీద వున్నా, చూపులన్నీ ఆమెమీదే కేంద్రీకృత మయ్యాయి.

"మీరూ కూర్చోండి ..." మాటలు కలపటం కోసం అన్నాడు ప్ర. రావు.

సందేహించకుండానే మరో కుర్చీలో కూర్చుంది వాసంతి

"ఫిఫ్టీ... ఫిఫ్టీ...మీరూ తీసుకోండి ." అంటూ పకోడీల ప్లేటును బల మీద ముందుకు జరిపాడు. అభ్యంతర పెట్టకుండానే అతడు చెప్పినట్లు చేసిందామె

"మీరంటే నాకు ఎంతో ఇష్టం..." అన్నాడు కొంచెం జంకు తగ్గించుకొని.

"నాకూ అంతే..." అంది అలంకార భూషితమైన చిరునవ్వుతో.

# పందెంలో పైచేయి

"అయితే మిమ్మల్ని గురించి నా గుండె ఎంత కొట్టుకులాడుతోందో చూడండి.." అంటూ ముందుకు వంగి అప్రయత్నంగా ఆమె చేతిని పట్టుకొని తన ఛాతీకి ఆనించుకున్నాడు.

ఈసారి కొంచెం వెనకాడినట్టు లేచి నిలబడి తన చేతిని వెనక్కి తీసుకొంది వాసంతి.

"మీరు తొందరపడుతున్నారు... ఇటువంటి విషయాల్లో పెద్దల అంగీకారం అవసరం" అంది.

అయితే ఇది గట్టికేసే... పెద్దలు, అంగీకారాలు అంటోంది- చివరికి పరిస్థితి ఎలా మారుతుందో?... ఏమీ జరగకముందే తను తోక ముడించటం ఉత్తమమేమో?...

కానీ... ఈమెను విడిచి ఎలా వెళ్లటం. తనను రెచ్చకొట్టింది, ఇంత దూరం తీసుకు వచ్చింది. తనూ ధైర్యం చేసి వచ్చాడు... ఇంతా జరిగాక అధైర్యపడట మేమిటి? ఏం జరిగితే అది జరుగుతుంది.. తనకు వాసంతి కావాలి ఆమె నవ్వు కావాలి.

"మీ పెద్దలతో మాట్లాడటానికి నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు ధైర్యం కూడబలుక్కొని.

"అయితే మా అమ్మను పంపిస్తాను. మాట్లాడండి" అంటూ లోపలికి వెళ్ళింది వాసంతి.

ఆమె అలా వెళ్ళిన కొద్ది క్షణాలకే ఓ ఆకారం వచ్చింది లోపల్నుంచి.

"ఏం మాట్లాడవలసి వస్తుందో, ఏమో?"— దిగాలు పడుతూనే తల తిప్పి చూశాడు.

ఆ ఆకారం ఎవరో కాదు— అతడి భార్య లలిత !

భూమ్యాకాశాలు తల్లక్రిందులౌతున్నట్లు ఫీలవుతూ, "లలీ !...మవ్...నువ్ ... ఇక్కడికి ఎప్పుడు వచ్చావ్ !! ఎలా వచ్చావ్ !!!" అన్నాడు.

"మీరు రాకముందే వచ్చాను... ఏమండీ ...అయితే నామీద ప్రేమ, ఆ తీయని మాటలు అన్నీ బూటకమేనా ? ... నేను మీకు ఏం తక్కువ చేశానండీ పరాయివాళ్ళ కోసం ఆశపడుతున్నారు ? ... ఈవేళ మీరు కోరి వచ్చింది నా స్నేహితురాలు వాసంతి కాబట్టి సరిపోయింది అదే మరొకర్తైతే ? ...జీవితంలో ఎప్పుడో అప్పుడు నాకిలా అన్యాయం చేసేవాళ్ళేగా ?" కన్నీటి పర్యంతమై నిలదీసినట్టు అడిగింది లలిత.

అంతా అయోమయంగా వుంది ప్రద్యుమ్నరావుకు

"ఈ వాసంతి నీ స్నేహితురాలా లలీ ?" అడిగాడు పగం వచ్చినట్లు క్రుంగిపోతూ.

"అవునండీ రావుగారూ ! లలితదీ, మాదీ ఒకే వూరు స్నేహితురాళ్ళం కూడా ... కొద్దిరోజుల క్రితమే వుద్యోగరీత్యా నేనీ వూరు వచ్చాను... ఆ మధ్య లలితను చూడటానికని మీ యింటికి రావటం జరిగింది. అప్పుడు మీరు యింట్లో లేరు ... ఆ నాడు తన భర్తగా మిమ్మల్ని ఘనంగా పొగుడుతూ మాట్లాడింది లలిత దానిమాటకు నేను అడ్డు చెప్పాను, మగబుద్ధిని నమ్మటానికి వీలు లేదంటూ ... కానీ, విన్నది కాదు. 'నా భర్త అందరిలాంటి వారు కారు' అని వాదించింది. దాంతో నేను పందెం వేశాను ... మీరు దంపతయుతంగా దిగిన ఫోటో చూశాను కనుక మిమ్మల్ని తేలిగ్గానే గుర్తుపట్టాను. పందెం నెగ్గించుకోవటం కోసం గాలం విసిరాను చేపలా వచ్చి పడ్డారు మీరు ..." అంటూ వాసంతి విరగబడి నవ్వింది, లోపలి నుంచి వచ్చి.

చిత్తయిపోయాడు ప్రద్యుమ్నరావు. 'నా బుద్ధిలా వక్రించిందంటే అందుకు బాధ్యులు ఎవరు ? మీరు కదూ?' అంటూ వాదించాలనుకున్నాడు కానీ, అలా చేయలేక పోయాడు.

"ఇప్పుడేమంటావే లలితా ?" విజయ గర్వంతో అడిగింది వాసంతి.

"ఇది మహిళా సంవత్సరం కదండీ. ఏ విషయంతీసుకున్నా — అందులో గెలుపు ఆడవాళ్ళదే !" అప్రయత్నంగా అనేశాడు ప్రద్యుమ్నరావు.

"కరెక్ట్ అన్నయ్యగారూ !... ఇకనైనా మీరు మగబుద్ధిని కొంచెం అదుపులో వుంచుకోవటం అలవాటు చేసుకోండి. లేకపోతే—ఇది మహిళాసంవత్సరం !" అంది వాసంతి జోక్ చేస్తున్నట్టు.

లలిత అమాయకంగా నిలబడి ప్రద్యుమ్నరావు వైపు చూస్తోంది.

అతడు తన కళ్ళతో ఏమో సంభాషించటానికి ప్రయత్నిస్తున్నాడు.